క్లుప్తంగా

ఘనంగా జెండా ఉత్సవం



జెండా ఉత్సవంలో పాల్గొన్న ఫకీర్లు, భక్తులు

కడప కల్చరల్ : స్థానిక హోమియోపతి కళాశాల వద్ద ఏఎస్ఆర్ నగర్‌లోగల హజరత్ మహబూబ్ సుబహాని దస్తగీర్ సాహెబ్ దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గురువారం జెండా ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఫకీర్ల మేళతాళాలు, సాహస విన్యాసాల మధ్య అలంకరించిన జెండాను దర్గాలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా దర్గాప్రతినిధులు స్థానిక ప్రముఖులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దర్గా కమిటీ సభ్యులు కేఎస్ మహబూబ్‌బాష, టి.బాష, ఎస్.మస్తాన్‌ల ఆధ్వర్యంలో అన్నదానం, ఖవ్వాలీ కచేరి చేపట్టారు.

పుస్తక పఠనంతో ప్రయోజనాలెన్నో

వైవీయూ: పుస్తక పఠనం చేయడం ద్వారా జ్ఞానార్జనతో పాటు ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం కలుగుతాయని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, వక్తృత్వ, ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గురివిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

దైవ సేవలో ఆదర్శం బిషప్ అరుళయ్య

కడప కల్చరల్ : దైవ సేవల్లో బిషప్ అరుళయ్య అందరికీ ఆదర్శంగా నిలిచారని మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ ఆరోగ్యస్వామి అన్నారు. గురువారం స్థానిక శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్‌తో కలిసి ఆయన కళాశాల ఆవరణలోగల బిషప్ అరుళయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మడగలం ప్రసాద్ మాట్లాడుతూ ఏడాదిపాటు అరుళయ్య సంస్మరణగా జిల్లా వ్యాప్తంగా క్విజ్, వ్యాసరచన పోటీలు, ఆయన జీవిత చరిత్రను తెలిపే ఫోటోల ప్రదర్శనలను అన్ని చర్చిలు, విద్యా సంస్థల్లో ప్రదర్శిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జ్యోతి జార్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రైమ్ 2.0ను ఉపసంహరించుకోవాలి




జిల్లా రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న దస్తావేజు లేఖర్లు, వెండర్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రిజిస్ట్రేషన్స్, స్టాంపుల శాఖలో ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రైమ్ 2.0 విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని దస్తావేజు లేఖరుల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటి వేణుగోపాల్, నగర అధ్యక్షులు ఉల్లి సంజీవరాయుడు డిమాండ్ చేశారు. దస్తావేజు లేఖర్లు చేపట్టిన ఆందోళన గురువారానికి మూడవరోజుకు చేరుకుంది. నిరసన అనంతరం జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖర్ల పరిరక్షణ సమితి నాయకులు ఓబులేశు, రామకృష్ణారెడ్డి, రామకృష్ణ, యాకోబ్, సురేష్ కుమార్‌రెడ్డి, ఇక్బాల్, సుబ్బారెడ్డి, లోకనాథంతోపాటు దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్లు పాల్గొన్నారు.

19న అరుణాచలంకు ప్రత్యేక సర్వీసు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఈనెల 19వ తేదీన అరుణాచలంకు ప్రత్యేక సర్వీసు ఏర్పాటు చేశామని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. రాత్రి 9.30 గంటలకు సూపర్‌లగ్జరీ సర్వీసును నడుపుతున్నామన్నారు. ఇప్పటికే రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీనియర్ ఫొటోగ్రాఫర్ మృతి



ప్రభాకర్‌రావు (ఫైల్)

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ వి.ప్రభాకర్‌రావు గురువారం తన స్వగృహంలో కన్నుమూశారు. రాజా కలర్ ల్యాబ్ అధినేతగా జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులుగా ఆయన జిల్లా ఫొటోగ్రాఫర్లు, ఆ రంగ ప్రముఖులకు సుపరిచితులు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫొటో వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చంద్రారెడ్డి, కడప ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శంకర్‌రెడ్డి, కార్యదర్శి శివరాం, నాయకులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సినీ నిర్మాతగా.. తల్లిదండ్రులు జాగ్రత్త, భావిపౌరులు తదితర సినిమాలను నిర్మించి నటించారని గుర్తు చేశారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా



30వ డివిజన్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : దేశంలో ఎక్కడా లేని విధంగా, ఏ ముఖ్యమంత్రి చెయ్యలేని విధంగా సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అమలు చేసి ప్రజలకు అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్ బాష అన్నారు. గురువారం స్థానిక 30వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ షేక్ మహమ్మద్ ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా అంజాద్‌బాషా మాట్లాడుతూ పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. రైతు భరోసా, రైతు భరోసా కేంద్రాలు, ఉచిత పంటల బీమా, ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం, నాడు - నేడు, ఆరోగ్యం, అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, పెన్షన్ కానుక, ఇండ్ల నిర్మాణం, జల యజ్ఞం, జగనన్న భూహక్కు భూ రక్ష .. తదితర ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. జగనన్న ఉంటేనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. మహిళా సాధికారత, మహిళా సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను నోబెల్ గ్రహీత డూఫ్లో కొనియాడారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, 30వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మహమ్మద్ షఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బీహెచ్ ఇలియాస్, జమాల్‌వలీ, అజమతుల్లా, హరూన్ బాబు పాల్గొన్నారు.

జగనన్న మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు

జగనన్న మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వైఎస్సార్‌సీపీ క్లస్టర్ అధ్యక్షులు పి. జయచంద్రారెడ్డి, లక్ష్మయ్య అన్నారు. గురువారం స్థానిక 21వ డివిజన్‌లోని సంధ్యా సర్కిల్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను, ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పద్నాలుగేళ్లు టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ జిల్లాలో చెప్పుకోదగిన అభివృద్ధి కార్యక్రమం ఒక్కటీ చేపట్టలేదన్నారు.



సంధ్యా సర్కిల్ వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మన జిల్లా వాసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం వల్ల కడపలో రూ.1500 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. 21వ డివిజన్ కార్పొరేటర్ ఎం. సుజాత, ఇన్‌చార్జి ఎం. సుబ్బరాయుడు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ నాలుగేళ్లలో తమ డివిజన్‌లో సుమారు రూ.9 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని, సుమారు 39 పథకాల ద్వారా రూ.20 కోట్లు ప్రజల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్, జెండా, టోపీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి ఎం. రామలక్ష్మణ్‌రెడ్డి, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రెచ్చగొట్టిన టీడీపీ నాయకులు

సంధ్యా సర్కిల్ సమీపంలో ఫుట్‌పాత్‌పై వైఎస్సార్‌సీపీ నాయకులు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటాన్ని సహించలేని టీడీపీ నాయకులు రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. టీడీపీ పార్లమెంటు ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి షాపింగ్ మాల్ ఎదుట సమావేశం నిర్వహించడమేంటి... వారికి ఇంకెక్కడా స్థలం దొరకలేదా అంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ప్రతిగా తాము సమావేశం నిర్వహిస్తామని తమ అనుచరులను పోగేశారు. దీంతో డీఎస్పీ షరీఫ్ ఆధ్వర్యంలో పోలీసులు వైఎస్సార్‌సీపీ నాయకులకు నచ్చజెప్పి సమావేశం త్వరగా ముగింపజేశారు.

పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు

ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవితాల్లో వెలుగు వచ్చిందని వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి తోటక్రిష్ణ అన్నారు. గురువారం స్థానిక 3వ డివిజన్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, సచివాలయం వద్ద సంక్షేమ పథకాల పట్టికను ప్రదర్శించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి బుక్‌లెట్లు అందించి గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

నేడు కడప నుంచి అయోధ్యకు అక్షింతలు

కడప కల్చరల్ : అయోధ్యలో జరగనున్న శ్రీరామ జన్మభూమి మందిర ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా కడప నుంచి శుక్రవారం పవిత్ర అక్షింతలను తీసుకు వెళ్లనున్నట్లు విశ్వహిందూ పరిషత్ ప్రాంత ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ బెస్తవేముల రామమహేష్ తెలిపారు. ఉదయం 7.00 గంటలకు అల్మాస్‌పేట కూడలిలోగల శ్రీ విఘ్నేశ్వర, అభయాంజనేయ, సాయినాథ ఆలయాల వద్దకు అక్షింతలతో భక్తులు భారీ శోభాయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం నగరంలోని ముఖ్య కూడళ్ల మీదుగా పాత బస్టాండులోని గాలిదేవర ఆంజనేయస్వామి ఆలయం వద్దకు ఉదయం 9.00 గంటలకు చేరుకోనుందని, అక్కడ పూజలనంతరం అక్షింతలను అయోధ్యకు తీసుకు వెళతామని వివరించారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నంద్యాల పట్టణంలో ఈనెల 17, 18, 19 తేదీలలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సి బషీరున్నీసా పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె విలేకరులతో మాట్లాడారు. 17వ తేదీ బహిరంగ సభ ఉంటుందని, 18, 19 తేదీల్లో సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మహిళల స్థితిగతులు, మహిళా అభ్యున్నతి కోసం చర్చలు జరుగుతాయన్నారు. మహిళలు అధిక సంఖ్యలో మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఎల్.ఉషారాణి

కడప కల్చరల్ : ఉన్నత విద్యతోనే వ్యక్తికి ఉజ్వల భవిష్యత్తు లభించగలదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఎల్.ఉషారాణి అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడవరోజు గురువారం స్థానిక మున్సిపల్ మెయిన్ హైస్కూలులో నిర్వహించిన క్విజ్, చిత్రలేఖన పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్దల సూచనతో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు బాల్యం నుంచే ప్రణాళికబద్ధంగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆశయాలను తెలుసుకుని ప్రోత్సహించారు. అనంతరం ఇంటాక్ ఆధ్వర్యంలో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ పర్యవేక్షణలో నగరంలోని పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం విభాగంలో జరిగిన చిత్రలేఖన పోటీలకు 15 పాఠశాలల నుంచి 250 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని రంగురంగుల చిత్రాలు గీసి మురిపించారు.

నేటి పోటీలు : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10.00 గంటలకు స్థానిక మున్సిపల్ మెయిన్ హైస్కూలులో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ తెలిపారు. సాయంత్రం గ్రంథాలయ సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రముఖ గ్రంథాలయ ఉద్యమ నాయకులపై వక్తలు ప్రసంగించనున్నారు.

క్విజ్ పోటీలు

కడప కల్చరల్ : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో గురువారం క్విజ్ పోటీ నిర్వహించారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని విశేషాలపై నిర్వహించిన ఈ పోటీలో నగరానికి చెందిన 15 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో స్థానిక నజ్ముల్ అమీన్ పబ్లిక్ హైస్కూలు విద్యార్థులు అఫ్సర్, సన నాజ్, అస్మా, అయేషా బృందం అత్యధిక మార్కులతో ప్రతిభ స్థానం సాధించారు. బాల వికాస్, నాగార్జున మోడల్ హైస్కూలు విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలువగా, శాంతినికేతన్ హైస్కూలు విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు.

కలెక్టర్‌కు ఆహ్వానం

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి రావాలంటూ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఎల్.ఉషారాణి కలెక్టర్ విజయరామరాజును ఆహ్వానించారు. గురువారం ఆమె కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి ఈ మేరకు ఆహ్వాన పత్రం అందించారు.

సేవలను యాప్‌లో నమోదు చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆశా కార్యకర్తలు యాప్‌లో ప్రతిరోజు ఐదు రకాల సేవలను నమోదు చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. గురువారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఆశా నోడల్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులు, యుక్త వయస్సు యువతులకు రక్తహీనత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని రకాల సేవలను ఆశా నోడల్ అధికారులు పర్యవేక్షిస్తూ పనితీరును మెరుగు పరచాలని, అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నమోదు చేసిన రెఫర్ కేసులను పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలని సూచించారు. డెమో భారతి మాట్లాడుతూ లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న పీహెచ్‌సీలలో కారణాలు కనుగొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపెయిన్లు గుర్తించిన క్షయ, కుష్ఠు కేసులకు పరీక్షలు నిర్వహించి వెంటనే చికిత్స ప్రారంభించాలన్నారు. అలాగే కుష్ఠు కేసుల్లో సర్జరీలు అవసరమైన వారికి డీఎఫ్ఐటీ హాస్పిటల్, నెల్లూరులో ఉచితంగా సర్జరీలు, సమస్యలున్న వారికి ఇతర సేవలు అందిస్తారన్నారు. వాటి వివరాలు వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డెమో సిబ్బంది, ఆశా నోడల్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఉమామహేశ్వర్‌రావు

నిమోనియా లక్షణాలు గుర్తించాలి

పిల్లల్లో వచ్చే శ్వాస కోశ వ్యాధులు, నిమోనియా వ్యాధి లక్షణాలను క్షేత్ర స్థాయిలో త్వరగా గుర్తించడం ద్వారా ఐదు సంవత్సరాలలోపు పిల్లల మరణాలను తగ్గించవచ్చని డాక్టర్ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. గురువారం సాయంత్రం వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీ సీహెచ్‌ఓల ద్వారా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స చేయాల్సిన విధానం, ఉన్నత ఆస్పత్రులకు రెఫర్ చేయాల్సిన విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో లెప్రసీ టీబీ అధికారి డాక్టర్ రవిబాబు, డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి మునిరెడ్డి, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

పాత్రికేయుల సేవలు మరువలేనివి

కడప కార్పొరేషన్: సమాజానికి పాత్రికేయులు అందిస్తున్న సేవలు మరువలేనివని రక్షణ, సీజేపీ ఫౌండేషన్ అధ్యక్షులు పి. సంపత్ కుమార్, చైతన్య అన్నారు. పత్రికా దినోత్సవం సందర్భంగా పలువురు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో తాడిత, పీడిత ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించడంలో పత్రికలు, మీడియా చేస్తున్న కృషి అనిర్వచనీయమన్నారు. పత్రికా దినోత్సవం సందర్భంగా పాత్రికేయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో నిందితుడు అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని దేవునికడప రోడ్‌లోని పెట్రోల్ బంక్‌లో డబ్బులను స్వాహా చేసిన కేసులో నిందితుడు వల్లూరు మండలం అంబవరానికి చెందిన చిన్న చెంచు నరసింహారెడ్డిని గురువారం అరెస్ట్ చేసినట్లు కడప టూటౌన్ సీఐ తబ్‌రేజ్ తెలియజేశారు. నిందితుడు దేవుని కడప రోడ్డులో వున్న పెట్రోల్ బంకులో పంపుబాయ్‌గా పనిచేస్తుండేవాడు. గత కొంతకాలంగా ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా పెట్రోల్ బంక్‌లో వచ్చే డబ్బులను అతని ఖాతాలో జమచేసుకున్నట్లు, లక్షల్లో స్వాహా చేసినట్లు మేనేజర్ ఫిర్యాదు మేరకు గత ఆగష్టులో కేసు నమోదు చేశారు. ఈ చీటింగ్ కేసులో నిందితుడైన నరసింహారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు.

ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

చింతకొమ్మదిన్నె : స్థానిక ఆర్టీఓ కార్యాలయం సమీపంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. కడప నగరంలోని ఎర్రముక్కపల్లిలో ఉన్న భారతీ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులకు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ హారికారెడ్డి, హెచ్ఓడీలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెట్పీటీసీ పి.నరేన్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : ప్రొద్దుటూరు సమీపంలోని మల్లేల వద్ద ఇటీవల దైవ దర్శనానికి వెళ్తూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను గురువారం సీకేదిన్నె జెట్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి పరామర్శించారు. ప్రమాదంలో ఒకే కుటుంబ సభ్యులు మృతి చెందడంతో మృతుల పెద్ద కర్మకు వారి కుటుంబ సభ్యులకు రూ.20వేలు అందించారు. కార్యక్రమంలో మండల సమన్వయకర్త గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గజ్జల శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యానేరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా ప్రొటెక్షన్ ఆఫీసర్ జి.సునీత తెలిపారు. గురువారం నగరంలోని అంగడివీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఆమె మాట్లాడుతూ బాలలకు రక్షణ కల్పించడంలో బాలల హక్కులు కీలకపాత్ర పోషించడం జరుగుతోందన్నారు. పిల్లలకు సంబంధించి సమస్యలు వచ్చినపుడు వాటిని ఎలా ఎదుర్కోవాలో, వివిధ చట్టాలు, వ్యవస్థల గురించి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బాల్య వివాహాలు నిరోధించడంలో ప్రతి విద్యార్థి చేయిచేయి కలపాలని సూచించారు. ప్రస్తుతం టెక్నాలజీ, సోషల్ మీడియా వంటి ప్రభావాలు పిల్లలపై ఎక్కువగా చూపుతున్నాయని, పిల్లలు జాగ్రత్త వహించాలని సూచించారు. సమస్యలుంటే 1098 టోల్‌ఫ్రీ నెంబరుకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ మెన్ హాకీ చాంపియన్‌షిప్‌కు యాసిన్



కడప స్పోర్ట్స్ : చెన్నై నగరంలో ఈనెల 17 నుంచి నిర్వహిస్తున్న 13వ హాకీ ఇండియా సీనియర్ మెన్ నేషనల్ హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు కడప నగరానికి చెందిన ఎస్. మహమ్మద్ యాసీన్ ఎంపికయ్యాడు. ఇటీవల కాకినాడలో నిర్వహించిన ఏపీ సీనియర్ మెన్ హాకీ క్యాంపులో చక్కటి ప్రతిభ కనబరచడంతో సీనియర్ నేషనల్ హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు గోల్‌కీపర్‌గా ఎంపికయ్యాడు. కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో 4 నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యనభ్యసించడంతో పాటు హాకీలో పలు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. ప్రస్తుతం కడప నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంబీఏ చదువుతూ హాకీలో రాణిస్తున్నాడు.

డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన

కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతి పరీక్ష ఫీజుల పేరుతో విద్యార్థుల నుంచి దోపిడీ చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట వారు ఆందోళన చేశారు.

ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా నాయకులు శ్రీనాథ్ మాట్లాడుతూ కడప నగరంతోపాటు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేల్ తదితర ప్రాంతాల్లోని కార్పొరేట్, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు పదవ తరగతి పరీక్ష ఫీజు రూ. 125 అయితే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి 15 వందల నుంచి 3 వేల వరకు ఎటువంటి రసీదులు లేకుండా డబ్బులు వసూళ్లు చేస్తున్నారన్నారు. అనంతరం డీఈఓ రాఘవరెడ్డికి ఈ విషయమై వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

వరిలో పంట మార్పిడిపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రామ్మూర్తి

చెన్నూరు : మండలంలోని ఓబులంపల్లెలో రైతులకు వరిలో పంట మార్పిడిపై దృష్టి సారించే విధంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రామ్మూర్తి గురువారం అవగాహన కల్పించారు. రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై దష్టి సారించాలన్నారు. దీనికి సంబంధించి ఉపకరణాల పంపిణీ చేస్తామన్నారు. నీటి కొరత వలన రైతులు ఇతర ప్రత్యామ్నాయ పంటలు పప్పు ధాన్యాలు, నూనె పంటలు సాగుచేయడం వలన అధిక దిగుబడిని సాధించవచ్చునన్నారు. కేవీకేల ద్వారా రైతులకు అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.సాయిమహేశ్వరి, మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, ఇందిర విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

సొసైటీలను తీర్చిదిద్దడమే లక్ష్యం



సహకార కేంద్ర పథకాల పోస్టర్లను విడుదల చేస్తున్న ఓఎస్డీ, తదితరులు

పులివెందుల రూరల్ : సొసైటీలను బ్యాంక్‌లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సహకార సమాఖ్యల అభివృద్ధికి కృషి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీసీ బ్యాంక్ చైర్మన్ మల్లేల ఝాన్సీరాణిలు తెలిపారు. గురువారం నల్లపురెడ్డిపల్లెలో ఎర్రబల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన గోల్డ్ లోన్‌కు సంబంధించి స్ట్రాంగ్ రూంను వారు ప్రారంభించారు.

అనంతరం సొసైటీ ఖాతా దారులు, రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాయలసీమ పరిధిలో ఉన్న డీసీసీ బ్యాంక్ లను లాభాల బాటలో నడిపించారని చైర్మన్‌ను అభినందించారు. సొసైటీలో కూడా బంగారు రుణాలపై విరివిగా రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. సొసైటీలో ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశారన్నారు. సొసైటీ సహకార బ్యాంక్‌లలో అకౌంట్లు, డిపాజిట్లు చేసేవారికి విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. సహకార సొసైటీలను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రైతుల పిల్లలు విదేశాలలో చదివేందుకు ఎడ్యుకేషన్, హౌసింగ్ రుణాలు ఇచ్చేందుకు సొసైటీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. చిన్నపిల్లలు రుణాలను పొదుపు చేసే విధంగా తల్లి, పిల్లల మీద అకౌంట్లు ఓపెన్ చేసుకోవచ్చునన్నారు. అలాగే సహకార కేంద్ర పథకాలతో ఏర్పాటు చేసిన పోస్టర్లను వారు విడుదల చేశారు. డ్వాక్రా సంఘాలకు మంజూరైన చెక్కులను వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్ర సీఈఓలు రాజేంద్రకుమార్, సుభాషిణి, కో ఆపరేటివ్ ఆఫీసర్ సురేష్‌కుమార్, ఎర్రబల్లె సొసైటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గంగరాజు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బాలగంగిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, నీలకంఠారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, గంగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి, రామమల్లేశ్వరరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాల కోసం జగనన్న మళ్లీ సీఎం కావాలి



కమలాపురంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : మన కోసమే కాదు.. మన భవిష్యత్తు తరాల కోసం జగనన్న తిరిగి సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం కమలాపురం 1వ వార్డు సచివాలయంలో నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలి? కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గిడ్డంగి వీధిలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఎగురవేశారు. 1వ వార్డు సచివాలయం పరిధిలో రూ.35 కోట్లు ప్రజలకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా చేరిందన్నారు. అలాగే రూ.4 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేశామన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా కమలాపురంలో అభివృద్ధి జరిగిందన్నారు. దీనికి కారణం జగనన్నేనని స్పష్టం చేశారు. చంద్రబాబు వేల హామీలిచ్చి పాలన గాలికొదిలేశారన్నారు. జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే అరకొర ప్రభుత్వ పథకాలు వచ్చేవన్నారు. ప్రస్తుతం జగనన్న పాలనలో అర్హత ఉంటే చాలని, వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా ఇంటికి చేరుతాయన్నారు. అలాగే కోగటంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరుణ్‌రెడ్డి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసారెడ్డి, మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రాజుపాళెం సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీఎస్ నారాయణరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి, జడ్పీటీసీ సుమిత్రారెడ్డి, గఫార్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఖాజాహుసేన్, ఇర్ఫాన్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని కోట్లూరు గ్రామ సచివాలయంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగనన్నా కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు అబ్బిరెడ్డి వీరారెడ్డి పాల్గొని మాట్లాడారు. దిగువపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలకు ఈ నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా 29 కోట్ల 96 లక్షల రూపాయలను అందచేశారన్నారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరించి వైఎస్ఆర్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, సచివాలయ జేసీఎస్ కన్వీనర్ ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, పార్టీ నేతలు నాగిరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, పుల్లయ్య, మస్తాన్, ఎంపీడీవో కేఆర్ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు చేసిన మంచిని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డిలు తెలిపారు. మొయిళ్లకాల్వ గ్రామ సచివాలయంలో గురువారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. అలాగే మా నమ్మకం నువ్వే జగనన్న జెండాను ఎగవేశారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హుస్సేన్, కృష్ణారెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీకేదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొప్పర్తి సచివాలయంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో సీకేదిన్నె జెట్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఏపీకి జగనే ఎందుకు కావాలంటే పుస్తకాలను ఆవిష్కరించి వైఎస్ఆర్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఏపీ మైనార్టీ బోర్డు మెంబర్ హిదాయతుల్లా, మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, మండల సమన్వయకర్త గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.